# మురుగుతో ముప్పతిప్పలు

గ్రేటర్ మహానగరం స్మార్ట్‌సిటీగా అవతరించింది. అయినా.. పలు పనులు మాత్రం స్మార్ట్‌సిటీకి తగ్గట్టు కనిపించడం లేదు. నగరంలో నిత్యం ఏదో ప్రాంతంలో కాల్వలు పొంగి.. ప్రధాన రహదారులపై మురుగు పొంగి పొర్లుతూనే ఉంది. మరో వైపు మంచి నీటి పైపులైన్లు దెబ్బ తినడంతో మంచినీరు వృథాగా పోతోంది.

- యూజీడీలు శిథిలమై రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- పాదచారులు, వాహన చోదకుల ఇబ్బందులు



పాతనగరం కన్వేయర్‌బెల్ట్ ప్రాంతంలో రోడ్డుపై మురుగు నీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

దాబాగార్డెన్స్ : నియోజకవర్గ పరిధిలో నిత్యం ఏదో చోట భూగర్భ డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. ఈ సమస్య చాలా ప్రాంతాల్లో కనిపిస్తోంది. జిల్లా పరిషత్‌కు వెళ్లే రహదారిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం వద్ద నిత్యం డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇదిలా ఉండగా ఏ చిన్నపాటి వర్షం కురిసినా లోతట్టు ప్రాంతాలైన పూర్ణామార్కెట్, రామకృష్ణా జంక్షన్, ప్రసాద్‌గార్డెన్స్, వెలంపేట, పెరికివీధి, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న పలు భూగర్భ డ్రైనేజీల మ్యాన్‌హోల్స్ ప్పొంగి ప్రవహిస్తున్నాయి. అంతే కాక ఎగువ ప్రాంతపు కాల్వల్లో చెత్తా చెదారాలు/ప్లాస్టిక్ బాటిళ్లు/వైద్య పరికరాలకు సంబంధించి వినియోగించి వదిలేసిన వస్తువుల వంటివి అడ్డుతగిలితే ఎగువ ప్రాంతాల నుంచి కాల్వల ద్వారా వచ్చే మురుగు ఒక్కసారిగా ఉప్పొంగి జంక్షన్ అంతా మురుగు, వరదతో దర్శనమిస్తోంది.

**పర్యాటకులకు మురుగు తాకిడి..**

సుందరమైన విశాఖ బీచ్ పర్యాటకులకు మురుగు తాకిడి ఎక్కువైంది. కోస్టల్ బ్యాటరీ రోడ్డు నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లే బీచ్‌రోడ్డులోని రెండు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ శిథిలావస్థకు చేరడంతో మురుగు నీరు బీచ్‌రోడ్డుపై ప్రవహిస్తోంది. పెద్ద కాల్వల్లో టన్నుల కొద్దీ పేరుకుపోయిన పూడికలు తీయకపోవడంతో మురుగంతా రోడ్లు, వీధుల్లోకి వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో పేరుకుపోయిన దుర్వాసన పర్యాటకులకు శాపంగా మారింది.

**నెలకు పైబడే..**

మంచినీటి పైపులైన్ దెబ్బతినడంతో డాబాగార్డెన్స్ అంబేడ్కర్ కూడలి వద్ద నెల రోజుల పైబడి మంచి నీరు వృథాగా పోతోంది. అంతే కాక ఆ ప్రాంతంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అడిగే నాథుడు లేక నెల రోజులు పైబడినా సమస్య అలాగే ఉండిపోయింది.




ఎల్ఐసీ అంబేడ్కర్ కూడలి వద్ద మురుగు పారుదల వల్ల శిథిలమైన రహదారి

**చర్యలు చేపట్టినా..**

తరచూ మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపడుతున్నప్పటికీ ఎప్పటికప్పుడు ఈ పరిస్థితి కనిపిస్తూనే ఉంది. మురుగు నీరు ప్రవాహంతో ఇటు పాదచారులు, అటు వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే జీవీఎంసీ ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఇటీవల ఈ ప్రాంతాన్ని జీవీఎంసీ కమిషనర్ పలువురు ఉన్నతాధికారులు పరిశీలించారు కూడా.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన




రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పోలీసు శాఖ వినూత్న చర్యలు చేపట్టింది. రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతికి కారణమైన కారును నగర వీధుల్లో ప్రదర్శన నిర్వహిస్తున్నారు. నూతన వాహనాలను ప్రదర్శించడం చూసిన ప్రజలు ప్రమాదానికి గురైన కారును ఈ విధంగా ప్రదర్శించడంతో తిలకించడానికి ఆసక్తి చూపుతున్నారు.

– ఫొటో సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## జెట్టీ ఫీజు రద్దు చేయాలని విజ్ఞప్తి



మైలపల్లి లక్ష్మణరావు

మహారాణిపేట : బోట్లు వేటకు వెళ్లని నేపథ్యంలో ఆ సమయంలో విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌కు చెల్లించాల్సిన జెట్టీ ఫీజును రద్దు చేయాలని లేదా వన్ టైం సెటిల్మెంట్ చేసుకునే అవకాశం కల్పించాలని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు కోరారు. అసోసియేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోటు యజమానులు జీఎస్టీ, వడ్డీలు చెల్లించుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జెట్టీ ఫీజుపై పోర్టు ట్రస్టు ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఒక్కో బోటుకు ఏడాదికి రూ. 12 వేలకు పైగా జెట్టీ ఫీజు వసూలు చేస్తున్నారని అన్నారు. ఫిషింగ్ హార్బర్‌ను రూ. 152 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో తక్షణం సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, హార్బర్‌లో లైటింగ్, సీసీ కెమెరాలు అమర్చాలని కోరారు. షిప్పింగ్ కాంప్లెక్స్‌లో బోట్ల రిపేర్‌కు ఒక క్రేన్ అవసరం ఉందని, అదే విధంగా ఒక ట్రాలీ ఉండగా మరో మూడు అవసరమని పేర్కొన్నారు. నవంబర్ 21న మత్స్యకార దినోత్సవం నేపథ్యంలో వేట విరామ సమయంలో మత్స్యకారులకు చెల్లించాల్సిన భరోసా మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరల నేపథ్యంలో బోట్లకు బకాయి పడ్డ ఆయిల్ సబ్సిడీ మూడు కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని కోరారు. అదే విధంగా ప్రతి లీటర్ డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీ మొత్తాన్ని రూ. 9 నుంచి రూ. 15కు పెంచాలన్నారు. ఈ సీజన్‌లో ఇంతవరకు ఏడు మెకనైజ్డ్ బోట్లు డ్యామేజ్ అయ్యాయని, వాటికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. తరచూ చేపల వేటకు వెళ్లే 700 బోట్లకు ట్రాన్స్‌పాండర్లు అమర్చారని, దీనివల్ల ముందుగానే ప్రమాదాలను గుర్తించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే బ్యాటరీలు బలహీనంగా ఉండడం వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమేనని అన్నారు. బోట్లకు ఎకో సౌండ్ సిస్టం, జీపీఎస్, వీహెచ్ఎఫ్ సెట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. బయో డీజిల్ ధర లీటర్‌కు రెండు రూపాయలు తగ్గించడం పట్ల హర్షం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఇందుకు తగు సహకారం అందించిందని మైలపల్లి లక్ష్మణరావు పేర్కొన్నారు. మత్స్య పరిశ్రమ ప్రగతికి సహకరిస్తున్న ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్‌కు లక్ష్మణరావు ధన్యవాదాలు తెలిపారు.

## క్లుప్తంగా

### ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో జి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేషపూజలు చేశారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి బుధవారం దొండపర్తి, అక్కయ్యపాలెం, రైల్వేన్యూకాలనీ, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, పెదవాల్తేరు, లలితానగర్, శంకరమఠం, సీతంపేట, రామాటాకీస్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వయంగా అమ్మవారికి జలాభిషేకం చేయడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారులకు టీకాలు వేస్తున్న కొబ్బరితోట ఆరోగ్య సిబ్బంది

అల్లిపురం : చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం వెంకటేశ్వరమెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో బుధవారం నిర్వహించారు. కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు పోలియో, కోరింత దగ్గు, హెపటైటిస్ బి వంటి టీకాలు ఏఎన్ఎం మదీనమ్మ, భారతి, ఆశ వర్కర్ బుద్ధ లీలావతి, ఎం.అనురాధ వేశారు. చిన్నారుల తల్లులకు సలహాలు, సూచనలు అందజేశారు. చిన్నారులకు సమయానికి ఇవ్వాల్సిన వ్యాక్సిన్ల కోసం, వారికి ఇవ్వాల్సిన ఆహార పదార్థాల గురించి వివరించారు.

### చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



చెక్కును అందిస్తున్న దాతలు ప్రకాశరావు, లలిత దంపతులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం నగరంలోని విశాలాక్షినగర్‌కి చెందిన ఏఎస్ ప్రకాశరావు, లలిత దంపతులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత చెక్కుని ఆలయంలో సూపరింటెండెంట్ త్రిమూర్తులకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అందజేశారు. స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

### సైబర్ నేరగాళ్ల భరతం పట్టాలి

మద్దిలపాలెం: రోజుకో రకంగా జనాన్ని దోచేస్తున్న సైబర్ నేరగాళ్ల భరతం పట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఓబీసీ డిపార్ట్‌మెంట్ మాజీ చైర్మన్ మూల వెంకటరావు ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే రూ.1,750 కోట్లను సైబర్ నేరగాళ్లు దోచేశారని, జాతీయ సైబర్ నేరాల పోర్టల్‌లో రోజుకు 7,000 చొప్పున కేసులు నమోదవుతున్నాయని వివరించారు. సైబర్ నేరాలకు ఉన్నత విద్యావంతులు, వ్యాపారులు బలవుతున్నారని పేర్కొన్నారు.

## ప్రమాదాలకు నిలయంగా స్పీడ్ బ్రేకర్లు




మనోరమా థియేటర్ వద్ద స్పీడ్ బ్రేకర్‌తో ఇబ్బంది పడుతున్న ఆటో కార్మికులు



బౌదారా రోడ్డులో రేడియం కలర్ లేని స్పీడ్ బ్రేకర్

దాబాగార్డెన్స్ : వాహనాల వేగానికి కళ్లెం వేశారు. అంత వరకూ బాగానే ఉంది. అక్కడే పెద్ద తప్పు చేశారు. శ్రద్ధతో చేసే పని ఏదైనా ఫలితం ఇస్తుంది. తూతూ మంత్రంగా చేపట్టిన పనులతో వాహన చోదకులు పలు ఇబ్బందులకు గురవుతుండగా.. ప్రయాణికులు ఆస్పత్రి పాలవుతున్నారు. ఇదేంటని అనుకుంటున్నారా.. ఇది నిజమేనండి. వాస్తవానికి వాహనాల స్పీడ్‌ను నియంత్రించేందుకు సిటీ పరిధిలో ఎక్కడికక్కడ స్పీడ్ బ్రేకర్లు వేశారు. హర్షించదగ్గ విషయమే. అయితే అక్కడే మరో ప్రమాదం చోటు చేసుకుంటోంది. పెద్ద ఎత్తున స్పీడ్ బేకర్లు అయితే వేశారు గానీ.. ఆ నల్లటి స్పీడ్ బ్రేకర్లపై రేడియం కలర్‌తో కూడిన పెయింట్ వేయడం మరిచారు. అంతే కాక చాలా చోట్ల స్పీడ్ బ్రేకర్లు వేసిన ప్రాంతంలో వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో స్పీడ్ బ్రేకర్లు కనిపించడం లేదు. దీంతో ద్విచక్ర వాహన చోదకులతో పాటు ఆటో వాలాలు పలు ఇబ్బందులకు గురవుతుంటే.. ఆటోల్లో ప్రయాణించే పాసింజర్లు మాత్రం ఆస్పత్రుల్లో చేరాల్సి వస్తోంది. గత రెండు రోజులుగా సెయింట్ ఆంథోనీ చర్చి వద్ద వేసిన రెండు స్పీడ్ బ్రేకర్ల వద్ద విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో.. ఆటోవాలాలు స్పీడ్‌గా వచ్చి చీకట్లో కనిపించని స్పీడ్ బ్రేకర్లు ఎక్కి ప్రమాదాలకు గురయ్యారు. గత రెండు రోజులుగా పలువురు కేజీహెచ్‌కు వెళ్లాల్సిన దుస్థితి వచ్చింది. అధికారులు స్పందించి వేసిన స్పీడ్ బ్రేకర్లకు రేడియం కలర్‌తో కూడిన పెయింటింగ్ వేయాలని పలువురు అభ్యర్థిస్తున్నారు.

## శక్తి స్వరూపిణి.. జ్ఞాన ప్రదాయిని



మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గాలమ్మ



సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి



సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు

దాబాగార్డెన్స్ : పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ విద్యార్థులతో సరస్వతీ పూజ నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి గురువారం మహాలక్ష్మీదేవిగా దర్శనమివ్వనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీకుమార్, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

**మహాలక్ష్మీదేవిగా దుర్గాలమ్మ..**

నగరంలోని 35వ వార్డు పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఏడో రోజుకి చేరాయి. అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. భవనామాల ధార భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. గురువారం దుర్గాదేవి(దుర్గాష్టమి)గా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

**సరస్వతీదేవిగా కనకదుర్గమ్మ..**

అల్లిపురం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో అమ్మవారి దేవాలయాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.



శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో కుంకుమపూజలో పాల్గొన్న భక్తులు

**సరస్వతీదేవిగా ఉమాదేవి..**

టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు కుంకుమపూజలు, విశేష పూజలు నిర్వహించారు.

**అనఘాలక్ష్మీ దేవి ఆలయంలో..**

వివేకానందకాలనీలోని శ్రీ సాయి దర్బార్‌లో వెలసిన అనఘాలక్ష్మీ, రాజశ్యామల, వారాహి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా అమ్మవారు భక్తులకు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పూజా కార్యక్రమాలు చేపట్టారు.



సరస్వతీ దేవిగా ఉమాదేవి



సరస్వతీ దేవిగా అనఘాలక్ష్మీదేవి



సరస్వతీ దేవిగా సాగరగిరి కనకదుర్గ



అమ్మవారిని పూజిస్తున్న అర్చకుడు భార్గవ శర్మ

## పప్పన్నమూ కష్టమే



రేషన్ వాహనం వద్ద సరకుల కోసం నిరీక్షిస్తున్న కార్డుదారులు

- రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే సరఫరా
- కందిపప్పు, పంచదార ఊసే లేదు
- బయటి మార్కెట్‌లో ధరలకు రెక్కలు
- పేద, మధ్య తరగతి ప్రజలకు అవస్థలు

సీతమ్మధార : పేద, మధ్య తరగతి ప్రజలకు పండగ పూట పప్పన్నమూ కష్టమే అన్నట్లుగా ఉంది పరిస్థితి. బయటి మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను అంటాయి. ఉప్పు నుంచి పప్పు వరకు ధరలు భారీగా పెరిగిపోయాయి. ధరలను అదుపు చేస్తామని, నిత్యావసర సరకులను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తామని ప్రకటనలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో విఫలం కావడంతో ప్రజలపై భారం పెరిగిపోయింది.

**రేషన్ దుకాణాలను పటిష్టం చేస్తామని..**

ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రేషన్ దుకాణాలను పటిష్టం చేస్తామని ప్రకటించారు. ఉప్పు నుంచి పప్పు వరకు తక్కువ ధరకే నిత్యావసర సరకులు అందిస్తామని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఆ దిశగా చర్యలు మాత్రం కానరావడం లేదు. రేషన్ దుకాణాల్లో ఏ సరకూ సక్రమంగా ఇస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. అధికారంలోకి వస్తే తొలుత కందిపప్పును రాయితీపై అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. దశలవారీగా పామాయిల్, గోధుమపిండి తదితర సరకులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు వంట నూనె, గోధుమ పిండి పంపిణీని పక్కన పెడితే కందిపప్పును అరకొరగా అందిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు పెరిగినప్పుడు పేదలకు సాంత్వన చేకూర్చేందుకు రైతు బజార్లు, రేషన్ డిపోలలో రాయితీపై వంటనూనె, కందిపప్పు, శనగపప్పు పంపిణీ చేసేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు పెరిగినపుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో కంది పప్పును రూ.67కే అందించారు. కూటమి ప్రభుత్వంలో ఇటువంటి చర్యలు కనిపించడం లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు.


**మూడు నెలలుగా ఇదే దుస్థితి**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగస్టు, సెప్టెంబర్‌లో కార్డుదారులకు పంచదార ఇవ్వనేలేదు. ఈ నెల అరకొరగా కందిపప్పు ఇస్తున్నారు. గత నెలలో వినాయక చవితి పండగ ఉందని తెలిసి కూడా పౌరసరఫరాల శాఖ పూర్తిస్థాయిలో పంచదార ఇవ్వకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మూడో నెల కూడా రేషన్ డిపోల ద్వారా కందిపప్పు పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం గమనార్హం. ప్రతీ నెలా కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యంతో సరిపెట్టేస్తున్నారు.

## టూటౌన్‌ను సందర్శించిన డీసీపీ

అల్లిపురం : నగర డీసీపీ అజిత వేజెండ్ల బుధవారం సాయంత్రం టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీకి సీఐ బి.తిరుమలరావు, సిబ్బంది స్వాగతం పలికారు. ఆమె స్టేషన్‌లో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్ల వివరాలు, సిబ్బంది కొరత తదితర విషయాలు తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాద పూర్వకంగా మసలుకోవాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అలవాటు చేసుకోవాలని సూచించారు.

## డైలాగ్ అండ్ డెమోక్రసీ పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఈఏఎస్ శర్మ తదితరులు

సీతంపేట : సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ అధ్యక్షుడు ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ రచించిన డైలాగ్ అండ్ డెమోక్రసీ 5వ సంపుటి ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఫోరం ఫర్ బెటర్ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎ.ఎస్.శర్మ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెమోక్రసీ అనేది అమెరికన్ కానిస్టిట్యూషన్ నుంచి తీసుకున్నామని, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పలు దేశాల రాజ్యాంగాల నుంచి అనేక విషయాలు సంగ్రహించి ముసాయిదా తయారు చేశారన్నారు. దేశంలో అందరికీ సమాన హక్కులు కల్పించేలా రాజ్యాంగం రూపొందించారని గుర్తు చేశారు. యువతరం ప్రశ్నించే తత్వం అలవాటు చేసకోవాలన్నారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయం సొసైటీ కార్యదర్శి డీఎస్.వర్మ, సాహితీవేత్తలు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.